క్లుప్తంగా

పోషకాహారంతోనే రక్తహీనత నివారణ



పోలేకుర్రులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లరేవు: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించవచ్చని సీడీపీఓ వి.మాధవి తెలిపారు. మంగళవారం పోలేకుర్రులో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రదర్శించి, పౌష్టికాహారం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు తెలియజేశారు. కార్యక్రమంలో పోలేకుర్రు, పి.మల్లవరం గ్రామాలకు చెందిన అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ సభ్యులు

ముమ్మిడివరం: మండలంలోని టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా యల్లమిల్లి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ముమ్మిడివరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న షిరిడీ సాయి ఆలయం వద్ద మంగళవారం టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా యల్లమిల్లి వెంకటేశ్వరరావు(పెద్ద), కార్యదర్శిగా కొమానపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రెడ్డి నాగేశ్వరరావు, కోశాధికారిగా బొక్కా కృష్ణార్జున, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరికి టాటా మ్యాజిక్ యజమానులు, డ్రైవర్లు పూలమాలలతో అభినందనలు తెలిపారు.

తీర్పునకు వ్యతిరేకంగా పిల్ వేశాం



ఐ.పోలవరం సమావేశంలో పాల్గొన్న మాలమహానాడు నాయకులు

ఐ.పోలవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా పిల్‌ను దాఖలు చేశామని జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెయ్యల పరశురాముడు పేర్కొన్నారు. మంగళవారం ఐ.పోలవరంలో జిల్లా మాలమహానాడు కార్యదర్శి రేవు శ్రీను అధ్యక్షతన మండల మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన అశోక్‌కుమార్, పరశురాముడు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. వర్గీకరణకు మద్దతు తెలిపే పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జల్లి శ్రీను, యలమంచలి బాలరాజు, వడ్డి గౌతమ్, మట్టా గగనవీరుడు, మాదేటి శ్రీను, నల్లా సుబ్బారావు, పండు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక 9వ వార్డులోని స్తంభాల మెరక ఝాన్సీలక్ష్మీబాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కౌన్సిలర్ గొలకోటి విజయలక్ష్మి గొడుగులను మంగళవారం పంపిణీ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థులకు గొడుగులు సమకూర్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎస్ఎన్ మూర్తి, గొలకోటి వాసు, నల్లా సత్తిబాబు, ముత్యాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు వివాహంపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం: పరాయి వ్యక్తితో మాట్లాడుతున్నాననే నెపంతో అక్రమ సంబంధం అంటకట్టి తమ అత్తింటి వాళ్లు బలవంతపు వివాహం చేయించారని ఓ మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం మండలం ఠానేలంక చినపేటకు చెందిన మెల్లం దయామణి అదే గ్రామంలోని పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తుంది. మంగళవారం తెల్లవారుజామున ఆమె తన ఉద్యోగ విషయంపై వాకింగ్‌కి వెళ్తున్న గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు ఇసుకపట్ల ఈశ్వర్‌కుమార్‌తో మాట్లాడుతుండగా అత్తింటి వాళ్లు చూశారు. అతడితో అక్రమ సంబంధం ఉందంటూ పెద్దల సమక్షంలో తగువు పెట్టి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈశ్వర్‌కుమార్‌తో తనకు బలవంతంగా వివాహం జరిపించారని దయామణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాఠశాల భవనాలకు చంద్ర గ్రహణం

- నాడు–నేడు నిర్మాణాలకు సిమెంట్ నిలిపేసిన ప్రభుత్వం
- వివిధ దశల్లో నిలిచిపోయిన పాఠశాల భవనాలు



కోడూరుపాడు జేబీలో అద్దె భవనంలో అరుగుపై చదువుకుంటున్న విద్యార్థులు



కోడూరుపాడు జేబీలో శ్లాబ్ దశలో నిలిచిపోయిన పాఠశాల భవనం

అల్లవరం: గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఉన్నతమైన స్థానం కల్పించారు. విప్లవాత్మకమైన నిర్ణయాలతో ప్రతి విద్యార్థికి అత్యుత్తమ విద్యనందించారు. విద్యకు సంబంధించి దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయనంత సంక్షేమాన్ని అమలుచేశారు. నాడు– నేడు పథకం ద్వారా పెద్ద ఎత్తున నిధులు కేటాయించి శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం తరఫున సిమెంట్ సరఫరా చేసి నిర్మాణాలను వేగవంతం చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో విద్యా వ్యవస్థ గాడి తప్పింది. విశాలమైన తరగతి గదుల్లో, ప్రశాంత వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులకు అరుగులు, ఆలయాలు, కమ్యూనిటీ హాళ్లలో చదువుకోవాల్సిన దుస్థితి పట్టింది.

నాడు–నేడు పథకాన్ని నీరుగార్చడానికే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాడు–నేడు పథకం ద్వారా నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలకు అవసరమైన సిమెంట్ సరఫరాను నిలిపేశారు. నిబంధనల ప్రకారం ఆయా నిర్మాణాలకు విడిగా సిమెంట్ కొనడానికి వీల్లేదు. దీంతో



కొమరగిరిపట్నంలో నిలిచిపోయిన ఎంపీపీ పాఠశాల భవనం

పాఠశాల భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ కారణంగా అనేకచోట్ల అద్దె భవనాల్లోనే చదువులు కొనసాగిస్తున్నారు. అల్లవరం మండలంలోని కోడూరుపాడు జేబీ, దేవర్లంక, తుమ్మలపల్లి మెయిన్, ఇటుకులగుంట, కొమరగిరిపట్నం నెంబరు–1, 3, పెనుమాలవారిపేట, బెండమూర్లంక జేబీ, ఆరగట్లపాలెం, గోడిపాలెం ప్రాంతాల్లో పాఠశాల భవనాలు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో అద్దె భవనాల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు అల్లవరం మండలంలోని బోడిపాలెంలో రామాలయంలో, కొమరగిరిపట్నం–3లో చర్చిలో, దేవర్లంకలో టిడ్కో భవనంలో తరగతులు జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కారణంగా ప్రభుత్వ విద్యాలయాలు కొత్తరూపును సంతరించుకున్నాయి. అప్పటి ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో పేరొచ్చింది. అందుకే కూటమి ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా ఎలాంటి పనులు జరగకుండా, పూర్తవకుండా అడ్డుకుంటుందన్న చర్చ విద్యాశాఖలో సాగుతోంది. నేటి బాలలే రేపటి పౌరులు అన్న సత్యాన్ని కూటమి ప్రభుత్వ నేతలు గుర్తించి మధ్యలో సిమెంట్ కొరత లేకుండా అందజేసి నిలిచిపోయిన పాఠశాల భవనాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు, సిమెంట్ కొరత వల్లే ఆగిపోయాయి



నిధుల కొరత కారణంగా పాఠశాల భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. కొన్ని భవనాలకు సిమెంట్ కొరత ఉంది. అలాంటి ప్రాంతాల్లో విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉపాధ్యాయుల చొరవతో అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నాం.

– కిరణ్‌బాబు, ఎంఈఓ, అల్లవరం

పేదలకు వస్త్రదానం

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు, నల్లా సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రాతి బడి వద్ద పేదలకు వస్త్రదానం, వినికిడి సమస్యలున్నవారికి వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావుల చేతుల మీదుగా వితరణ కార్యక్రమం నిర్వహించారు. 100 మంది పేదలకు దుప్పట్లు, 50 మందికి వినికిడి యంత్రాలు అందజేశారు. అనంతరం నల్లా పవన్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక లూయి అంధుల పాఠశాల, హరి మనో వికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

మున్సిపల్ మాజీ చైర్మన్లు చిక్కాల గణేష్, నల్లా విష్ణుమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కౌన్సిలర్ దొమ్మేటి రాము, పుల్లేటికుర్రు మాజీ సర్పంచ్ పెచ్చెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు శాశ్వత పరిష్కారం చూపండి

ఉప్పలగుప్తం: ఏటా తొలకరి సాగులో వర్షాలకు ముంపుబారిన పడుతున్న వరి పొలాలకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు రైతులు ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డిని కోరారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను ఆర్డీవో మంగళవారం పరిశీలించారు. పంట చేలల్లో ముంపు నీరు దిగేలా డ్రెయిన్లను ఆధునీకరించాలని, వలకట్లను తొలగించాలని రైతులు విన్నవించుకున్నారు. ఆక్వా చెరువుల వ్యర్థాలను కాలువలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ఆదిలోనే పంట నష్టపోయామని వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో 27 వేల ఎకరాల్లో వరి సాగు జరగగా, ఉప్పలగుప్తం మండలంలో అధిక నష్టం జరిగిందన్నారు. పంట నష్టాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు నాయకులు అరిగెల నానాజీ, మంచెం బాలకృష్ణ, మద్దింశెట్టి సీతారామస్వామి, నల్లా సత్యనారాయణ, సలాది నాగరాజు, పెనుమల్లె సత్యనారాయణ, సలాది శ్రీను, చిక్కం హరిప్రసాద్, ఏవో కుమార్‌బాబు, తహసీల్దార్ వి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

అమలాపురం టౌన్: అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఏపీ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. గత ప్రభుత్వంలోనే అప్పటి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అమలాపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. గతేడాది అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తూ సంబంధిత శాఖ నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి. అనంతరం వివిధ కారణాలతో ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. పీడీఎస్‌యూ వంటి విద్యార్థి సంఘాలే కాకుండా ఆజాద్ ఫౌండేషన్, కామన్ మ్యాన్ ఫౌండేషన్ వంటి సంస్థలతో పాటు పలు ప్రజా సంఘాలు కొన్నేళ్లుగా అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేశాయి. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుతో 50 ఏళ్ల కల సాకారం అవుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ, కామన్ మ్యాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే అమలాపురంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఉంది. దీనికి తోడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు కానుండటం శుభపరిణామం.

కార్పెంటర్ల సమస్యలపై తహసీల్దార్‌కు వినతి

అమలాపురం రూరల్: టింబర్ డిపోల్లో రెడీమేడ్ వేప కర్రతో కిటికీలు, గుమ్మాలు, తలుపులు తయారుచేసి అమ్మడం వల్ల కార్పెంటర్లు, చేతివృత్తిదారులు పని లేక జీవనోపాధి కోల్పోతున్నారని దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కార్పెంటర్ సమస్యలపై సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్ కిషోర్‌బాబుకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. దీనిపై ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలిసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, గున్నేపల్లి భీమశంకరం, కేతా సోమేశ్వరరావు, దంగేటి రామకృష్ణ, కొవ్వూరి శ్రీనివాసరావు, పాలమూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి

విజయవాడకు కోనసీమ పారిశుధ్య కార్మికులు

అమలాపురం రూరల్: భారీ వర్షాలు, వరదల కారణంగా అతలాకుతలమైన విజయవాడలో ప్రభుత్వ ఆదేశాలతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా నుంచి 102 మంది పారిశుధ్య కార్మికులు విజయవాడకు వెళ్లారు. 80 బస్తాల బ్లీచింగ్, 350 బస్తాల ముగ్గు, 20 లీటర్ల మలాథిన్ తీసుకెళ్లారు. అక్కడ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ముగ్గు, బ్లీచింగ్, మలాథిన్ తరలించారు. ఈ వివరాలను జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు మంగళవారం వెల్లడించారు.



విజయవాడ తరలి వెళ్లిన కోనసీమ పారిశుధ్య కార్మికులు

ఇంటింటా ఫీవర్ సర్వే

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అంబాజీపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మాచవరంలో ఇంటింటా ఫీవర్ సర్వేను మంగళవారం నిర్వహించారు. రెండు రోజులు కంటే జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం జ్వరపీడతుల వివరాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవాలి

అంబాజీపేట: పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్) గ్రూప్ సభ్యులైన చెంచులు వారి జీవన నాణ్యతను, శ్రేయస్సును మెరుగుపర్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, వక్కలంక గ్రామాల్లో సర్పంచ్‌లో దొంగ నాగేశ్వరరావు, వాసంశెట్టి రేవతిల అధ్యతన పీఎం ఏడబ్ల్యూఏఎస్ (ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ పీవీటీజీ గ్రూపు సభ్యులైన వారికి ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా 11 రకాల సౌకర్యాలు కల్పించనున్నారన్నారు. పక్కా ఇళ్లు, మంచి నీటి కుళాయి, రహదారుల నిర్మాణం, నాణ్యమైన విద్య, విద్యుత్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారన్నారు. ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బేస్‌లైన్ సర్వేలను నిర్వహించడం ప్రారంభించిన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వాసంశెట్టి పెదబాబు, ఈఓపీఆర్డీ బి.మమత, ఉపాధి ఏపీఓ ఏవీ కృష్ణ, ఎంఈఓ–1 కాండ్రేగుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.తాతాజీ పాల్గొన్నారు.



వక్కలంకలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోవర్

పేముల కాల్వకు మోక్షమెప్పుడో?

- ముందుకు సాగని మురుగునీరు
- పలు చోట్ల ఆక్రమణలు
- పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఆక్రమణలు, గుర్రపుడెక్కతో బక్కచిక్కిన పేముల కాల్వ డ్రైన్

మలికిపురం: పలు గ్రామాల్లో ముంపు, మురుగునీరు పారుదలకు ప్రధానమైన పేముల కాల్వ డ్రైన్‌లో మురుగునీరు ముందుకు సాగడం లేదు. ఈ డ్రైన్ పరిధిలోని శివకోడు, దిండి, రామరాజులంక, రాజోలు, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక, మట్టపర్రు గ్రామాల్లోని పంట పొలాలు, నివాస ప్రాంతాల మురుగునీరు వెళ్లే మార్గం లేక ఈ గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 ఏళ్ల నుంచి డ్రైన్ పూడుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్వల్పంగా మరమ్మతులు చేశారు. అయితే పూర్తిగా ఆక్రమణలకు గురికావడం డ్రైన్ మరమ్మతులకు ఆటంకంగా మారింది. శివకోడు బంగ్లా వద్ద నుంచి ప్రారంభమైన ఈ డ్రైన్ శివకోడుపాలెం, దిండి, మేడిచర్లపాలెం గుడిమెళ్లంక, విశ్వేశ్వరాయపురం గ్రామం మీదుగా వేపచెట్టు డ్రైన్‌లో కలుస్తుంది. శివకోడు–దిండి సరిహద్దులోని కట్టా వారి గ్రూపు నుంచి ప్రారంభమైన మరో డ్రైన్ కూడా వచ్చి దిండిలోనే రామరాజులంక డ్రైన్‌లో కలుస్తుంది. ఈ డ్రైన్లు మురుగునీటితో పాటు పేముల కాలువ మురుగునీటి ఏకమై ముందుకు సాగక ఈ గ్రామాల్లో పంట పొలాలు, నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి సుమారు ఆరు కిలోమీటర్లు పొడవు ఉండే ఈ డ్రైన్ చివరి భాగం నుంచి సుమారు రెండు కిలో మీటర్లు వరకూ 100 లింకులు వెడల్పు ఉంటుందని స్థానిక రైతులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఇక్కడ 20 లింకుల వెడల్పు మాత్రమే ఉందని మిగిలిన భాగం ఆక్రమణలకు గురైందని వారు పేర్కొన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం జరిగిన తాత్కాలిక మరమ్మతుల సమయంలో డ్రైన్ బాగానే ఉందని రానురానూ డ్రైను కుచించుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ డ్రైన్ వెంబడి ఆక్రమణల్లో కొబ్బరితోటలు అధికంగా ఉన్నాయి. వీటిని తొలగించడం కుదరదని రైతులు స్పష్టం చేయడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సుమారు నాలుగు వేల కొబ్బరిచెట్లు తొలగించాల్సి ఉన్నట్లు సమాచారం. అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోలేదు. ఫలితంగా రామరాజులంక, దిండి, మేడిచర్లపాలెం, శివకోడు, గుడిమెళ్లంక గ్రామాల్లోని ఆయకట్టుకు ఇబ్బందులు తొలగలేదు. ఈ గ్రామాల్లోని ఆయకట్టు ప్రమాదంలో చిక్కుకుంది. ఇప్పటికే ఆక్రమణలు, గుర్రపుడెక్కతో బక్కచిక్కిన పేముల కాల్వ డ్రైన్‌ను మరమ్మతులు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో డ్రైన్ల తాత్కాలిక మరమ్మతులు చేసి సార్వాకు ఇబ్బందులు లేకుండా చేసేది. ప్రస్తుత ప్రభుత్వం అదేమీ చేయలేదు. ఇదే కొనసాగితే భవిష్యత్‌లో శివకోడు, దిండి, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక గ్రామాల నుంచి వచ్చే మురుగునీటి పారుదల ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ డ్రైన్ పరిధిలో సుమారు మూడువేల ఎకరాల వరి సాగుతో పాటు, సుమారు 2 వేల నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఇక వర్షాకాలంలో కొబ్బరి తోటల నుంచి ముంపు నీరు దిగేందుకు కొబ్బరి తోటలకు కూడా ఈ డ్రైన్ చాలా అవసరం.

మరమ్మతులు చేయండి



పేముల కాల్వ డ్రైన్ అస్తవ్యస్తంగా ఉంది. కనీస మరమ్మతులు లేవు. వర్షం నీరు ముంపు దిగే పరిస్థితి లేదు. ఫలితంగా ఈ డ్రైన్ పరిధిలో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది.

– నల్లి అంజలీదేవి ఎంపీటీసీ, గుడిమెళ్లంక–మట్టపర్రు

ఆక్రమణలు తొలగిస్తాం



పేముల కాల్వ డ్రైన్ సమస్య తమ వద్ద ఉంది. దీనిపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రతిపాదనలు రూపొందించాం. గుర్రపుడెక్క కూడా తొలగిస్తాం.

– భూపతి రేష్మారాణి, డ్రైన్స్ జేఈ, మలికిపురం

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

అమలాపురం టౌన్: శ్రీపరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ రోడ్డులో ప్రజలకు మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. 216 జాతీయ రహదారి మీదుగా వెళుతున్న బాటసారులకు, వాహన చోదకులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈనెల 7న జరిగే వినాయక చవితి రోజున ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలతో మాత్రమే పూజలు చేసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సమితి సభ్యులు 'మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ప్రకాష్, శేషారత్నం, రామలక్ష్మి, సౌజన్య, యమున తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



సీపీఐ ఆందోళన కార్యక్రమాల వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా నాయకులు

అమలాపురం టౌన్: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పార్టీ నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ జిల్లాలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలపై ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ నెల 6న అమలాపురం కలెక్టరేట్ ముందు అధిక ధరలను తగ్గించాలన్న డిమాండ్‌తో నిరసన చేపడతామని చెప్పారు.

రీజినల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆచార్యులు



ఆచార్యులు

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం రీజినల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇందిరా గాంధీ ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్‌పీఎస్ఎన్ ఆచార్యులు ఎంపికయ్యారు. ఈ మేరకు పుదుచ్చేరి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.ప్రియదర్శిని నుంచి సమాచారం అందిందన్నారు. ఆచార్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.


ఉచిత హోమియో మొబైల్ వైద్య శిబిరం



అంతర్వేది గుడి వద్ద శిబిరం నిర్వహిస్తున్న హోమియో వైద్య బృందం

సఖినేటిపల్లి: టెలీకాలింగ్ ద్వారా నూతన ఒరవడి సృష్టిస్తోంది ఉచిత హోమియో మొబైల్ వైద్య శిబిరం. ఈ శిబిరం ద్వారా రోగులకు వైద్య సేవలు చేరువ చేస్తున్నారు పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణుడు డాక్టర్ కోసూరి రామకృష్ణానంద రాజు (డాక్టర్ పోడూరు రాజు). శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ ఆధ్వర్యంలో రోజూ ఒక్కో గ్రామంలో ఉచిత హోమియో పిల్స్ వైద్య సేవలు ప్రజలకు అందజేయడం జరుగుతుంది. సోమవారం (సెప్టెంబర్ 2) అంతర్వేది గుడి వద్ద హోమియో పిల్స్ వైద్య బృందం ఈ కార్యక్రమం చేయడం జరిగింది. 22 మందికి ఉచితంగా డాక్టర్ టెలీ కాలింగ్ ద్వారా రోగుల వ్యాధులను తెలుసుకొని, దీర్ఘకాలిక వ్యాధులకు సైతం తగిన సలహాలు, సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పి.గన్నవరం: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పి.గన్నవరంలో మంగవారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకూ ర్యాలీ జరిగింది. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కల్పించుకోవాలని పి.గన్నవరం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ప్రభాకర్, ఎంపీహెచ్‌ఈఓ రెడ్డి, హెచ్‌వీ శాంతకుమారి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.